

# నమ్మకాలు జ్ఞాపకాలు

సౌదా

జ్యోత్స్నకీ నాకూ సంబంధం లేదు.

అదుగో. యీ మాటనగానే మీరు నవ్వుతారని నాకు తెలుసు. అందుకే యెవరికీ చెప్పడం మానేశా.

వాళ్ళయనకి చెప్పాను. నమ్మాడు. అది చాలు నాకు.

మీరూ మా జ్యోత్స్నా అనుకోకుండా వొకేరోజు నాకీ విషయం చెప్పడం యెంత ఆనందదాయకమో చెప్పలేను అన్నాడు ఆయన స్వయంగా మా యిద్దరికీ టీ యిస్తూ. ప్రపంచమంతా ఆయనలాగా విషయాలను గ్రహించగలిగితే యెంత బావుణ్ణు. టీ చాలా బావుంది.

పోఖ్రాన్ దినాన జరిగిందిదంతా. మళ్ళీ జ్యోత్స్న కలవనే లేదు. నేనూ మరిచా.

మొన్న పొద్దున్న జ్యోత్స్న నా దగ్గిరికి వొచ్చింది. తర్వాత తెలిసింది వొచ్చేసింది అని.

యేం పని యిది? యిప్పుడు లోకం యేమనుకుంటుంది? అన్నాను.

యేమనుకుంటుంది? అంది జ్యోత్స్న.

అహాఁ. అది కాదు. మునిసామి యేమనుకుంటాడు? అన్నాను.

వాడెవడు? అంది జ్యోత్స్న.

అహా. నేనేమనుకుంటానో ఆలోచించావా? అన్నాను.

నువ్వెవడివి? నీకూ నాకూ యేమిటి సమ్మంధం? పిచ్చిపిచ్చిగా వాగక విను. నాకూ మా ఆయనకీ యెటువంటి సమ్మంధం లేదు. యీ రోజుతో అది తెగిపోయింది. ముందు టీ పెట్టు. చక్కెర తక్కువ అని విసవిసా పెరట్లోకి నడిచింది.

జ్యోత్స్న నట్టింట్లో విసిరేసిన కాన్వాస్ బ్యాగ్ లోపలపెట్టి నేను రెండు కప్పులు కాఫీ కలిపాను. వొక కప్పులో అరస్పూను యింకో కప్పులో రెండు స్పూన్లు వేశాను చక్కెర. చెరో చేత్తో కప్పులు పట్టుకుని యిటు తిరిగాను.

యెదురుగా జ్యోత్స్న.

ఆకాశంనీలం చుడీదార్‌లోకి మారింది. నుదుట యెర్రమచ్చ లేదు.

-లెక్కపెట్టాను మొత్తం డజను! అని అందుకోకుండానే తలొంచి వొక కప్పు సిప్ చేసి అబ్బ! అని యింకో కప్పు తీసుకుంది.

జ్యోత్స్న యెంగిలి చేసిన కప్పు మిగిలింది నా చేతిలో.

యీ యెంగిలి యెవడు తాగుతాడు నీ మొగుడూ అన్నాను మంటెత్తి.

-యెంతమంది వొచ్చి పోయారో లెక్కా అది? అంది.

యేమిటన్నట్టు చూశాను.

పెరట్లోకి లాక్కెళ్ళి చూపించింది.

నీళ్ళతొట్టి పక్కన కొబ్బరిచెట్టుకు తిలకం బొట్లున్నాయి. చాలా. స్టిక్కర్లు. నేనదే గమనించడం మొదటిసారి.

-అదుగో. ఆ పైది నాది. యిప్పుడే పెట్టా తాజాగా అంది.

దానికన్నాపైది మెహరూన్ ఖాళీ నుదురా? యాల్లా!

నేను వాటిని లెక్కబెడుతుండగా

-యిందాక నోరుజారావు. నాకే మొగుడూ లేడు. ఆ మాట యెత్తొద్దింక అంది జ్యోత్స్న.

తొమ్మిది దాటుతోంది. యిద్దరం సిటీబస్టాపు దాకా వొచ్చి చెరొక బస్సులో యెవరి ఆఫీసుకు వాళ్ళం బయలుదేరాం. వెళ్ళేటప్పుడు రూమ్ తాళం లాక్కుంది.

-యింక నీ యిష్టం వొచ్చినప్పుడు రా. నేను నీ కోసం వెయిట్ చేస్తూ యింటి బయట కాపలా కాయలేను. వొచ్చేప్పుడు దీనికి

డూప్లికేట్ చేసుకొస్తా అంది.

నేను జ్యోత్స్న వాళ్ళాయనకి ఫోన్‌చేశా ఆఫీసు నుంచి- యేందీ గొడవ అని.

ఆయన సిగ్గుపడిపోయాడు ఫోనులో. యేం చెప్పడానికీ మొహమాటపడ్డాడు. నీళ్ళు నమిలాడు. చివరికి యెట్లాగో చెప్పాడు. తన ముక్కు నచ్చలేదట జ్యోత్స్నకి.

పెద్ద ప్రాబ్లమే.

నేనేదో చిన్నా చితకా daily trifle అనుకున్నా.

యెప్పట్నుంచి? అన్నాను.

యెప్పట్నుంచేమిటి? అన్నాడాయన.

అదే నచ్చకపోవడం యెప్పట్నుంచీ అని అన్నాను.

నిన్నట్నుంచీనండి అన్నాడు.

మొన్నటి వరకూ వోకేనా? అన్నాను యేమనాలో తోచక.

మొన్నటి వరకూ బానే వుందండీ. నిన్నట్నుంచే పట్టుకుంది పడిశం అన్నాడు.

పడిశమా? అన్నాను.

ఆ. మరే. ముక్కుకండీ. పడిశం అన్నాడు.

ముక్కుకు కాకుంటే మోకాలికొస్తుందా అన్నాను చిర్రెత్తి.

మోకాలికి మొన్ననే తగ్గిందండీ అన్నాడు.

యేమిటీ అన్నాను గతుక్కుమని.

యేదో వినిపించింది అవతల్నుంచి. కన్‌ఫ్యూజ్ అయ్యి పెట్టేశాను ఫోను.

జ్యోత్స్న నా దగ్గరుంది అని చెప్పడం మరిచేపోయాను. ఆఫీసు నుంచి సాయంత్రం యింటికెళ్ళేసరికి తాటికాయంత తాళం వేలాడుతోంది. యింకా రాలేదు జ్యోత్స్న.

రావడం రావడం రాత్రి పదింటికొచ్చింది.

తలుపు దబదబా బాదేస్తోంది. కరెంట్ లేదు కాలింగ్ బెల్ మోగడానికి. పాడడం ఆపి ఫ్లూట్ చేతబట్టుకునే తలుపు దగ్గరికెళ్ళా.

హాల్లో వెలుగుతున్న కేండిల్ ముద్దయిపోయింది అప్పటికే. ఆ కాంతికి గోడపైని కేలండర్‌లో లక్ష్మీదేవి జాణతనం మెరుస్తోంది. ఆ మేకుకే వేలాడుతున్నాయి డూప్లికేట్ తాళాలు. లోపల కాన్వాసు బ్యాగ్ లేదు. అంటే సాయంత్రం వొచ్చి వెళ్ళిపోయిందన్న మాట జ్యోత్స్న. నేను తాళం పగలగొట్టుకుని యింట్లోకి వొచ్చాకగానీ యీ విషయం తెలీలేదు.

యేమైంది? యెక్కడికెళ్ళింది? అని టెన్షన్.

తలుపు చప్పుడు వినబడగానే టెన్షన్ అంతాపోయి కోపం మండుకొచ్చింది.

తలుపు తీసి రండి రండి అన్నాను.

నా వెటకారం గానీ నేనెట్లా యింట్లోకొచ్చాననేది గానీ యేదీ పట్టించుకునే స్తితిలో లేదు జ్యోత్స్న. నేరుగా వంటింట్లోకెళ్ళి పాత్రలు చూసింది. నేనక్కడికి యింకో కేండిల్ వెలిగించి తెచ్చాను. రెండు నిమిషాల్లో నూడుల్స్ వొండి పళ్ళెంలో పెట్టుకుని కూచుంది.

ఆకలి కరకరలాడుతున్నట్టుంది.

మంచినీళ్ళు తెచ్చిపెట్టాను.

మాటల్లేవు యిద్దరికీ.

రాత్రిని వెలుగునీడల్లో చెక్కినట్టుంది జ్యోత్స్న ఆ కేండిల్ లైట్ పక్కన. సిలౌటీలోని ఆ ప్రొఫైల్‌ని పొరబాట్న తినెయ్యకుండా నన్ను నేను నిగ్రహించుకున్నాను.

తటాలున కళ్ళెత్తి చూసింది నన్ను.

ఆ సొగసుకు నా బుర్రలో క్రిటికల్ ఫ్యాకల్టీస్ మొద్దుబారిపోయాయి.

నా హ్యూమర్ సంపూర్ణంగా నశించింది.

అంత అందంగా తినడం నేనెప్పుడూ చూడలేదు.

నేనోడిపోయిన ప్రతిసారీ నేనంటే వాత్సల్యమే తప్ప ఆమెలో విజయగర్వాన్ని కూడా యెప్పుడూ నేను చూడలేదు.

వోడిపోడానికి చాలా గ్నానం కావాలిరా అంది.

గ్నానినా? అగ్నానినా? ఆధారం దొరక్క గాలిలో దేవులాడుతున్నాను.

అసంపూర్న అగ్నానీ అని నిద్రలేపింది నన్ను జ్యోత్స్న పొద్దున.

బద్ధకంగా లేచాను.

నా యెదురుగుండా వాళ్ళాయన కూచుని వున్నాడు. సర్దుకున్నాను.

నేను నిద్రలో వుండగా చూస్తూ కూచున్నాడన్న మాట. మేనర్‌లెస్ బ్రూట్. వొక చేత్తో విక్స్ యిన్‌హేలరూ వొక చేత్తో కర్చీఫూ అలంకారాలుగా ధరించి వెర్రి నవ్వు వొకటి నవ్వాడు.

నాకు కాఫీ యిచ్చింది జ్యోత్స్న.

నేను కాఫీ తాగివొచ్చాను అన్నాడాయన జలుబుగా. తనకి కాఫీ యివ్వకపోయేసరికి.

అతని వెనక నిలబడి నవ్వాపుకుంటోంది జ్యోత్స్న తడికురులు ఆరబెట్టుకుంటూ బాల్కనీలోకి.

కాఫీ తగలగానే పూర్తి స్పృహలోకి వొచ్చాను. కొత్తగా స్ట్రాంగ్‌గా వుంది కాఫీ. ఆ మళయాళీ షాపులో తెచ్చినట్టుంది జ్యోత్స్న కాఫీపొడి.

సిగరెట్ తీసుకుని అగ్గిపెట్టి కోసం చూస్తున్నాను.

కిటికీలోంచి వొచ్చిపడింది అగ్గిపెట్టి జ్యోత్స్న వాళ్ళాయన నెత్తిమీదుగా.

అప్పుడు చూశాను ఆయన్ని. చెంప, మెడ నవనీతం రాసినట్టు మందు. బొబ్బలెక్కినట్టుంది కాలి.

-లిల్ల సాయత్రం పక్కిట్టి ఆవిడికి యిద్దామని పాయసం వొడ్దాను. యిత్తలో జోస్న వొచ్చిల్ది. తలొచ్చేసరికి అదత్తా యాదృచ్ఛికం. లాకు వేరే వుద్దేశం యేం లేదు. యేదో యిరుగూ పొరుగూ కదా అలీ అని నీళ్ళు నములుతున్నాడు జ్యోత్స్న వాళ్ళాయన చెంప చూపిస్తూ.

అతను యేం చెబుతున్నాడో నాకు వొక్క ముక్క అర్థం కావడం లేదు. నా వాలకం కనిపెట్టి అతను మరింత సంజాయిషీ ధోరణికి దిగాడు.

నేను అయోమయంగా బాల్కనీలోకి చూశాను.

నవ్వలేక అవస్తపడుతోంది జ్యోత్స్న.

నిన్న సాయంత్రం యిక్కణ్నుంచి జ్యోత్స్న నేరుగా యింటికెళ్ళిందన్న మాట. అక్కడేదో జరిగింది అనుకున్నా. ఆ పాయసమేదో మొహాన కొట్టినట్టుంది.

వొక చేత్తో కర్చీఫ్‌తో చీది యింకో చేత్తో యిన్‌హేలర్ ముక్కులో పెట్టుకుని ముక్కలు ముక్కలుగా చర్చి కన్ఫెషన్ బాక్స్‌లో పాపి మాట్లాడుతున్నట్టు మాట్లాడుతున్నాడు జ్యోత్స్న వాళ్ళాయన.

మాట్లాడుతుంటే పొట్ట కదులుతోంది తమాషాగా. దాన్ని పెంచడం తప్ప వేరే దురలవాట్లేవీ లేవాయనకు.

మరి కొంచెం సేపటికి వాళ్ళాయన మోటార్‌బైక్



యెక్కి వెళ్ళిపోయింది జ్యోత్స్న.

వెళ్ళిపోయే ముందు మళ్ళీ నాతో చెప్పించుకున్నాడు ఆయన జ్యోత్స్నకీ నాకూ యెటువంటి సంబంధం లేదని.

నేనా మాట అనగానే- అద్దుకే కదల్ది మీరట్టే లాకు గౌరవం అన్నాడు- మొహం చేటంత చేసుకుని. యింకా యేమేమో చెప్పాడు. జ్యోత్స్నని తనెంత బాగా చూసుకుంటున్నదీ వైద్యపరీక్షలు చేయిస్తున్నదీ యేకరువు పెట్టాడు. గ్నాపకశక్తికి రెండేళ్ళుగా రకరకాల మందులు తినిపిస్తున్నాడంట జ్యోత్స్నకి. గయ నించి కూడా తెప్పించాడంట.

గ్నాపకశక్తి యేమిటీ? మందులేమిటీ? వీడికేమైనా పిచ్చిగానీ యెక్కిందా?

నేను వినడం మానేసి ఆయన్నే చూస్తున్నాను.

పెయింటింగ్, మ్యూజిక్, పుస్తకాలూ, ఫ్రెండ్సూ, క్యాంప్‌ఫైర్లూ యేవీ మరిచిపోవడం లేదట జ్యోత్స్న.

మరి మరిచిపోవడం లేదంటాడు. గ్నాపకశక్తి లేదంటాడు!

నేనేం అన్లేక జ్యోత్స్న వాళ్ళాయన్నే చెప్పనిచ్చా.

గ్నాపకశక్తి లేకపోతే వివాహ వ్యవస్త మనుగడ యెట్లా సాధ్యం? యిదీ ఆయన అడిగిన దాని సారాంశం.

ఆ రెంటికీ యేమిటి లంకె? అని బుర్ర బద్దలు గొట్టుకుని ఫోన్ చేశాను జ్యోత్స్న ఆఫీసుకి.

ఫోన్ బద్దలయ్యేంతగా నవ్వింది జ్యోత్స్న.

నాకు పెళ్ళయిన విషయం గ్నాపకం వుండడం లేదంట్రా. అందుకు మందులు అంది ఆ రాత్రి నా పక్కనే కూచుని హరిప్రసాద్ చౌరాసియా కచేరిలో. ప్రోగ్రాం అయ్యి మేం బయటికొచ్చేసరికి మోటార్‌బైక్ తెచ్చి రెడీగా వున్నాడు జ్యోత్స్న వాళ్ళాయన.

యేం గ్నాపకశక్తి!

(4- 1- 99)